సర్వం శివోహం

ఊరూ.. వాడా మహా శివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు, పెద్దలు, మహిళలు శివనామస్మరణతో తరించారు. సర్వం శివోహం అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఇందుకూరుపేట : గంగపట్నంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) స్వామి, అమ్మవార్ల కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : దక్షిణ కాశీగా పేరుగాంచిన రామతీర్థంలో కొలువైన కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న సముద్ర తీరంలో స్నానాలు ఆచరించి సైకత శివలింగాలను ఏర్పాటు చేసుకుని పూజలు జరిపారు. అలాగే ఊటుకూరు, విడవలూరు, పార్లపల్లి, తుమ్మగుంట, తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెంలో

మండలంలోని జొన్నవాడలో కొలువైన ప్రసిద్ధ మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలక మండలి సభ్యుడు నందకుమార్ పాల్గొన్నారు.

ఉదయకళేశ్వరుని దర్శనానికి బారులు

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. బుచ్చి సీఐ జి.రామారావు, కొడవలూరు ఎస్సై జి.సుబ్బారావు బందోబస్తు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గిన్నె భిక్ష వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు బందారు సుబ్రమణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య, నిర్వాహక కమిటీ సభ్యులు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, బెల్లం వెంకట నగేష్‌నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనసంద్రమైన మైపాడు బీచ్

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు బీచ్ భక్తజన సంద్రమైంది. తీరంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు. నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిరిడీ సాయి భక్త బృందం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మైపాడు గ్రామంలోని అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు బందారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. గంగపట్నంలోని భవానీ సమేత గంగా తారకేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దూళిపాల శివకుమార్‌శర్మ బృందం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉభయదాతలుగా కర్పూరం శివకుమార్‌రెడ్డి వ్యవహరించారు. పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాల స్వామి స్వామి ఆలయంలో గట్టుపల్లి పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. కొత్తూరు లలితా మహేశ్వరి ఆశ్రమంలో పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

మనుబోలు : మండలంలోని బద్దెవోలు రోడ్డు మార్గంలో కండలేరు ఒడ్డున కొలువైన కామాక్షి తాయి సమేత సంగమేశ్వరాలయానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అర్చకులు సాయిశర్మ, ఫణీంద్ర శర్మ స్వామివారికి అభిషేకం జరిపారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పచ్చిపాల రామిరెడ్డి దంపతులు, అవినాష్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మనుబోలు యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం, అన్నదానం నిర్వహించారు.

ఘనంగా..

వెంకటాచలం : మండలంలోని కనుపూరు, సర్వేపల్లి, కాకుటూరు గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కనుపూరు శివాలయంలో సర్పంచ్ నాటకం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉత్సవాలను జరిపారు. శివాలయం వద్ద ఉన్న వేపచెట్టు, రావిచెట్టుకు శ్రీమన్నారాయణ కల్యాణం నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద జంట నాగుల ప్రతిష్ట వైభవంగా సాగింది. కాకుటూరు గ్రామంలోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వేడుకలు ఘనంగా జరిగాయి. కాకుటూరు అడవిలోని శివాలయంతో పాటు సర్వేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాల్లోనూ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు.

హరహర మహాదేవ

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయంలో మహాదేవుడి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు, పీఆర్వో వేణుగోపాల్ తదితరులు సిద్ధేశ్వరుడిని దర్శించుకుని పూజలు ఆచరించారు. బ్రహ్మదేవిలోని కై లాసనాథేశ్వరాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. దివంగత మాజీ ఎంపీపీ మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముత్తుకూరు శివాలయంలో వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వల్లూరు శివాలయంలో దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

మార్మోగిన శైవక్షేత్రాలు

పొదలకూరు : వందల ఏళ్ల చరిత్ర కలిగిన పొదలకూరులోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. గురుకృప సంగీత విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆధ్యాత్మిక పాటకచ్చేరిని నిర్వహించారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు తన్నీరు సుబ్రమణ్యం, సభ్యులు దాదిబత్తిన విజయభాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. శివాలయం ప్రాంగణంలోనే విఘ్నేశ్వరాలయం, అయ్యప్పస్వామి దేవస్థానం ఉండడంతో భక్తుల తాకిడి అధికమైంది. ప్రధానార్చకుడు పీబీఎస్‌వీ ప్రసాద్‌స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నందిసేవకు ఉభయకర్తలుగా పొదలకూరు రైతు సంఘం వ్యవహరించింది.

- ప్రభగిరిపట్నంలోని పార్వతీ సమేత కై లాసనాథ స్వామి దేవస్థానంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతిదేవికి చందనాలంకారం, పూజలు, తీర్థప్రసాద వితరణ జరిగింది.
- చెన్నారెడ్డిపల్లి పంచలింగేశ్వరాలయంలో ఉదయం గణపతిహోమం, సాయంత్రం స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరయ్యారు.



విడవలూరు మండలంలోని రామతీర్థం తీరంలో ఏర్పాటు చేసిన సైకత శివలింగం



రామతీర్థంలో సముద్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో..



వెంకటాచలం : కాకుటూరు శివాలయంలో..



పొదలకూరు శివాలయ ప్రాంగణంలో..



పొదలకూరు : సంగీత విద్యార్థులతో పాటకచ్చేరి

కాటేపల్లి తీరం.. శివమయం

తోటపల్లిగూడూరు : మండలంలోని కాటేపల్లి శివాలయం, కోడూరు శివాలయం, తోటపల్లిగూడూరులోని ఖరేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కాటేపల్లి తీరంలో కొలువైన కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు రావడంతో దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. దీంతో కాటేపల్లి రహదారులన్నీ కిటకిటలాడాయి. మండపం సర్పంచ్ కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



కాటేపల్లి శివాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

నేడు పుణ్య స్నానాలు

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి భక్తులు ఆలయ ప్రాంగణంలో జాగరణ చేశారు. ఆదివారం వేకువజాము నుంచి సముద్రంలో భక్తులు పుణ్యస్నానాలు చేయనున్నారు.



మనుబోలు: సంగమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం



కొడవలూరు : స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం



ముత్తుకూరు : కృష్ణపట్నం శివాలయంలో పోర్టు సీఈఓ జీజేరావుకు స్వాగతం



ముత్తుకూరు : బ్రహ్మదేవి శివాలయంలో అన్నదానం



కొడవలూరు : ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

క్లుప్తంగా

కల్పవృక్ష వాహనంపై వెంకటేశ్వరస్వామి



గ్రామోత్సవంలో స్వామివారు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం రాత్రి కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి పూర్ణాహుతి, మంగళశాసనం నిర్వహించారు. అనంతరం కల్పవృక్ష వాహనంపై కొలువైన స్వామివారిని గ్రామోత్సవానికి తరలించారు. ఉభయకర్తలుగా ఈమని శ్రీహరి జ్ఞాపకార్థం ఆయన సతీమణి రుక్మిణమ్మ, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

- ఇస్కపాళెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, ఈశ్వరీదేవి మఠంలో స్వామివారికి శనివారం నందిసేవ నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా కోడూరు బ్రదర్స్ వ్యవహరించారు. అర్చకుడు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

బియ్యపు గింజపై శివలింగం



మనుబోలు : మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము బియ్యపు గింజపై శివలింగాన్ని చెక్కారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆవిష్కరించిన శివలింగం పలువురిని అబ్బురపరిచింది.

పండగలా క్రీడా దినోత్సవం



గుర్తింపు పత్రాలు అందుకున్న విద్యార్థులు

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో శనివారం క్రీడా దినోత్సవాన్ని పండగలా నిర్వహించారు. విద్యార్థులతో పాటు నర్సరీ, ప్రీ ప్రైమరీ చిన్నారులు కూడా ఆటపాటలతో గడిపారు. ఫుట్‌బాల్, ఖోఖో, షాట్‌పుట్, క్రికెట్, పరుగుపందెం, డార్జిబాల్ తదితర క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రిన్సిపల్ రితేష్ మెహతా పతకాలు, గుర్తింపు పత్రాలు అందజేశారు.

నేడు ఆరాధనోత్సవం

పొదలకూరు : పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లితిప్ప దేవగిరిక్షేత్రం వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు నారాయణస్వామి 15వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం జరుగుతాయని నిర్వాహకులు శనివారం వెల్లడించారు. ఉదయం నిత్య పూజలు, నవగ్రహ ఆరాధన, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి హోమం జరుగుతుందన్నారు.

లేగుంటపాడులో ఎడ్ల పరుగు పందెం

కోవూరు : మండలంలోని లేగుంటపాడు గ్రామంలో తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఎడ్ల పరుగు పందెం పోటీలు శనివారం జరిగాయి. గ్రామానికి చెందిన యోషిత రెడ్డి ఎడ్ల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అధిక సంఖ్యలో జనం తరలివచ్చి పోటీలను తిలకించారు.

పంటల నమోదుకు రేపు ఆఖరు

- జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

కొడవలూరు : పంట నమోదుకు సోమవారంతో ఆఖరు గడువు అని, రబీ సాగు చేస్తున్న రైతులు పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జి.సుధాకర్‌రాజు కోరారు. మండలంలోని గండవరం, బొడ్డువారిపాళెల్లో శనివారం ఆయన పర్యటించి పంట నమోదుకు సంబంధించిన సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20వ తేదీలోగా పంట నమోదైన రైతులు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించేందుకు అర్హులవుతారన్నారు. అదేవిధంగా ఇప్పటికే పంట నమోదు చేసుకున్న రైతులు ఈనెల 25లోగా ఈ–కేవైసీ చేయించుకోవల్సి ఉందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట ఏడీఏ నర్సోజీరావు, ఏఓ లక్ష్మి, వీఏఏలు సుజిత్, నవీన్, శ్రావ్య, కవిత ఉన్నారు.



సూపర్ చెక్ రికార్డులు పరిశీలిస్తున్న సుధాకర్‌రాజు

నేడు అంకుపల్లికి మంత్రి కాకాణి రాక

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెం సచివాలయ పరిధిలో ఉన్న అంకుపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి శనివారం తెలిపారు. గ్రామస్తులకు సంక్షేమ పథకాల గురించి వివరించి వారి సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

ఉదయకళేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే ప్రసన్న



ఆయన సన్నిధిలో ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన ఉదయకళేశ్వరస్వామిని స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. డీసీఎమ్మెస్, డీపీబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య తదితరులు ఉన్నారు.

కొరుటూరులో ఉచిత వైద్యశిబిరం

ఇందుకూరుపేట : బేతనియ బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో మండంలోని కొరుటూరులో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కళ్లు, మూత్రపిండ, నెమ్ము, ఊపిరితిత్తులు, గర్భకోశ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు ఏఆర్కే హిమబిందు, జె.జయరాజు, మనోజ్‌కుమార్, వీఎమ్ స్నిగ్ధ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాలి విక్టర్ లాజరస్, జి.రవికుమార్ పాల్గొన్నారు.

వేగంగా గ్రామాల అభివృద్ధి



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, తమది చేతల ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో పర్లపాడు, బీసీ కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి శనివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం తమదన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులు చేస్తుండడంతో ఇప్పుడు ధైర్యంగా ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నట్లు వెల్లడించారు. గతంలో పర్లపాడు గ్రామానికి వస్తే సిమెంటు రోడ్లు లేవని గగ్గోలు పెట్టేవారని, ప్రస్తుతం ఎక్కడా మట్టిరోడ్డు కనిపించడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో మాకు ఇళ్లు ఇచ్చారు కానీ బిల్లులు ఎగ్గొట్టారని ఇక్కడి ప్రజలు తెలిపారని, వారికి బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల పెత్తనం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరి సంక్షేమానికి కట్టుబడి పనిచేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఏఈలు కార్తీక్‌రెడ్డి, చంద్రశేఖర్, రవికుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కొండూరు జనార్దన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, వెందోటి భాస్కర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, రవికుమార్, నరేంద్ర, వెంకటేష్, మహేంద్రవర్మ, రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్

ముత్తుకూరు : జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో స్థానిక ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్ విజేతగా నిలిచింది. ముత్తుకూరు ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్‌లో గంటా సాంబశివరావు జ్ఞాపకార్థం నాలుగు రోజుల పాటు జరిగిన పోటీలో జిల్లా వ్యాప్తంగా 44 బృందాలు పాల్గొనగా, శనివారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో స్థానిక ఎస్‌ఆర్ బ్రదర్స్–ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్ మధ్య హోరాహోరీగా పోరు సాగింది. చివరకు ఎస్‌ఆర్ బ్రదర్స్ ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. నెల్లూరు బాయ్స్ తృతీయ స్థానం, కావలి బృందం నాలుగో స్థానం చేజిక్కించుకున్నాయి. విజేతలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. పవర్ రాజా ఆల్‌రౌండ్‌గా బహుమతి అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ముత్యం గౌడ్, పోర్టు పీఆర్వో గంటా వేణుగోపాలరావు, ఎస్సై శివకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కోటారెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి కాకాణి

ఇసుక తిన్నెలపై వేరుశనగ సాగు

- తీరంలో ముమ్మరంగా సాగు

బుచ్చిరెడ్డిపాళెం : విడవలూరు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ఇసుక తిన్నెలపై రైతులు వేరుశనగ పంటకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ సంవత్సరం రబీ కింద ట్యాగ్–24 అనే రకానికి చెందిన వేరుశనగ పంటలను 2,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వేరుశనగ పంటలో అధిక దిగుబడులతో పాటు, మంచి లాభాలను కూడా రైతులు గడించారు. దీంతో వేరుశనగ పంటపై తీర ప్రాంతంలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పెదపాళెం, ఆంజనేయపురం, వీరారెడ్డిపాళెం, కంచరపాళెం, శంభునిపాళెం, గౌరీపురం, బుసగాడిపాళెం, వెంకటనారాయణపురం, పొన్నపూడి, ముదివర్తి తదితర గ్రామాల్లోని ఇసుక తిన్నెలపై పంటను ముమ్మరంగా సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువ, రాబడి ఎక్కువ

ఇసుక తిన్నెలపై వేరుశనగ సాగుకు రైతులు బిందు సేద్యం ద్వారా సాగునీరు అందిస్తుంటారు. దీంతో పాటు ఆధునిక పద్ధతుల్లో విత్తనాలు నాటడం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కేవలం ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడులు పెడుతున్నట్లు రైతులు తెలిపారు. అయితే వేరుశనగ పంటను ఆశించే తెగుళ్లను సస్యరక్షణ చర్యల ద్వారా రక్షించుకుంటూ, కలుపు నివారణ చర్యలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సేంద్రియ, రసాయన ఎరువులను వాడటంతో ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు(బస్తా 40 కేజీలు) వరకు దిగుబడులు సాధిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. గత సంవత్సరం 40 కేజీల బస్తా రూ.3 వేలు ఉండగా, ఈ సంవత్సరం రూ.4 వేలు ఉంది. ప్రస్తుతం పంట కోత దశలో ఉందని, మరి కొన్ని రోజులు ఉండడంతో ధర పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

80 శాతం రాయితీపై విత్తనాలు

గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాల కారణంగా మండలంలోని దాదాపు 280 మంది రైతులకు సంబంధించి వేరుశనగ పంట నీటమునిగింది. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి కే–6 అనే రకానికి చెందిన వేరుశనగ విత్తనాలను రైతులకు 80 శాతం రాయితీతో అందించారు. దీంతో నాటిన పంట ఆలస్యమవుతోంది.



ఆధునిక పద్ధతుల్లో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతన్న



బిందుసేద్యం ద్వారా సాగవుతున్న వేరుశనగ పంట

ఆసక్తి చూపుతున్న రైతులు



గత కొన్ని సంవత్సరాలుగా వేరుశనగ పంటలో లాభాలు ఎక్కువగా రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తున్నాయి. దీంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు వేరుశనగ పంటకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల 280 మంది రైతులకు 80 శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలను అందజేశాం.

– వెంకటకృష్ణయ్య, ఏఓ

మంచి ధర ఉంది



మార్కెట్‌లో వేరుశనగకు మంచి డిమాండ్ ఉంది. గత సంవత్సరం కంటే మంచి ధరలు ఉన్నాయి. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. కోతలు వచ్చే సమయానికి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం చాలా సంతోషం.

– మేకల చిట్టిబాబు, రైతు, పెదపాళెం